క్లుప్తంగా

శ్రీనివాసుడికి చందనం అలంకరణ


చందనం అలంకరణలో స్వామివారు

మెంటాడ: మండల కేంద్రంలో ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు స్వామి వారిని చందన అలంకరణలో అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా నెల రోజులు పాటు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వెంకన్నకు పూలంగి సేవ


పూలంగి సేవలో స్వామివారు

బొబ్బిలి: పట్టణంలోని కంచర వీధిలో ఉన్న కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం స్వామివారికి పూలంగి సేవ నిర్వహించారు. కడియం నుంచి తెప్పించిన వివిధ రకాల పూలతో దేవతామూర్తులను అలంకరించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

నిబంధనలు పాటించాలి


మెస్ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం సిటీ: పట్టణంలోని హోటల్స్, మెస్ యజమానులు నిబంధనలు పాటించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ సూచించారు. శ్రీకాకుళం రోడ్డులో ఉన్న వాసవీ మెస్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తదితరులు

మెంటాడ: కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా ప్రభుత్వ పాఠశాలలో కూడా నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తోందని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని బడేవలస గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శనివారం బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఎన్నడూ విద్య, వైద్యానికి ఇంతటి ప్రాధాన్యత ఇచ్చింది లేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, ఎంతఓలు మోహనరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

550 మందికి వైద్య పరీక్షలు

రేగిడి: స్థానిక ఉంగరాడమెట్ట వద్ద శనివారం పాలకొండకు చెందిన శ్రీవిజయ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ దూబ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలో రేగిడి, ఆమదాలవలస, గుళ్లపాడు, వండానపేట, మజ్జిరాముడుపేట తదితర గ్రామాలకు చెందిన 550 మంది ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 10 మందిని ఆరోగ్యశ్రీ కింద ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎండీ దూబ పద్మావతి, పల్సస్ అధినేత డాక్టర్ గేదెల శ్రీనుబాబు, వైద్యులు సాయిశంకర్, సాయికృష్ణ, వీణాసరస్వతి, విజయశ్రీ, విజయ హాస్పిటల్ మేనేజర్ ధర్మారావు, పీఆర్‌ఓ వాసు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ


ఉపాధి మేట్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

రాజాం: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం మేట్లకు వారం రోజులుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఉపాధి వేతనదారులతో చేయించాల్సిన పనులు, కొలతలు, మస్తర్ల నమోదు, గిట్టుబాటు వేతనం పొందేందుకు అనుసరించాల్సిన పద్ధతులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు వివరించారు. అధికారులు సూచించిన అంశాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని ఎంపీపీ లావేటి సులోచన మేట్లకు సూచించారు. వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, ఈఓపీఆర్డీ వావిలపల్లి శ్రీనివాసరావు, ఏపీఓ సాయిరాం, ఈసీ శ్రీనివాసరావు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా సంబరం

గ్రామీణ యువతలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి, వారిని క్రీడల్లో ప్రోత్సాహించేందుగాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన పోటీల్లో పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్ తదితర పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు మైదానాలకు చేరుకుని విజిల్స్, కేరింతలు, చప్పట్లతో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. - సాక్షి నెట్‌వర్క్


రాజాం/రాజాం సిటీ: పొగిరిలో జరిగిన కబడ్డీ పోటీల్లో హోరాహోరీగా తలపడుతున్న మహిళలు


సంతకవిటి: సంతకవిటి జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు


రామభద్రపురం: ఆరికతోట సచివాలయం వద్ద ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు


రామభద్రపురం: తారాపురం సచివాలయం వద్ద క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు


బొబ్బిలి: పెంట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ మైదానంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ బొమ్మి అప్పలనాయుడు, తదితరులు


తెర్లాం: వి.చిన్నయ్యపేటలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చప్ప ఈశ్వరరావు


తెర్లాం: పెరుమాళి హైస్కూల్ మైదానంలో ఖోఖో ఆడుతున్న నెమలాం సచివాలయం పరిధిలోని క్రీడాకారులు


రేగిడి: లక్ష్మీపురంలో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

టీడీపీ హయాంలోనే ఇళ్ల స్థలాల ఆక్రమణలు

- ప్రభుత్వంపై నిందలు వేయడం తగదు
- వాడీవేడిగా మున్సిపల్ సమావేశం

బొబ్బిలి: ఇందిరమ్మ కాలనీతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల ఆక్రమణలు, అక్రమాలు టీడీపీ హయాంలోనే జరిగాయని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిందలేయడం మాని దమ్ముంటే అక్రమాలకు పాల్పడిన వారి పేర్లు బయటపెట్టాలని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, ఎస్.రామకృష్ణ, పాలవలస ఉమాశంకర్ తదితరులు టీడీపీ కౌన్సిలర్లను నిలదీశారు. మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు రాంబార్కి శరత్, ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలను పలువురు అధికార పార్టీకి చెందిన వారు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు భగ్గుమన్నారు. ప్రతీసారి అధికార పార్టీ అని అనడం ఎందుకని, అక్రమాలకు పాల్పడినవారి పేర్లు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరో ఆక్రమించుకుంటే మధ్యలో అధికార పార్టీని బద్నాం చేస్తారా అని టీడీపీ కౌన్సిలర్లను నిలదీశారు. ఆక్రమించిన వారి వివరాలను ప్రెస్‌మీట్ పెట్టి చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం టిడ్కో ఇళ్లకు చెల్లించిన డిపాజిట్లు ఇవ్వడం లేదని, ఆ నిధులను వాడేశారని ఆధారం లేకుండా టీడీపీ నాయకులు మాట్లాడటంతో.. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు దీటుగా సమాధానం ఇచ్చారు. వేల కోట్ల నగదును ప్రజాసంక్షేమానికి ఖర్చు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై మాట్లాడే అర్హత ప్రతిపక్షాలకు లేదన్నారు. అలాగే ఇందిరమ్మ కాలనీ, తారకరామా కాలనీ, పాత బొబ్బిలి, తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఎన్నున్నాయో చెప్పాలని చాలా రోజులుగా కోరుతున్నా అధికారులు ఇవ్వడం లేదన్నారు. త్వరగా ఆ వివరాలతో కూడిన ప్రతిని 30 మంది కౌన్సిలర్లకూ ఇవ్వాలని, లేకుంటే కార్యాలయంలోనే నిరాహార దీక్ష చేస్తానని వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ అధికారులకు అల్టిమేటం ఇచ్చారు. దీనిపై టీపీఓ వరప్రసాద్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ కాలనీలో 16 ఆక్రమణల పునాదులను తొలగించామని, ఇంకా ఎన్ని ఆక్రమణలున్నాయో గుర్తించాలని తహసీల్దార్‌కు లేఖ రాశామని చెప్పారు. వారి నుంచి పూర్తి సమాచారం అందితే తదనంతర చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ


రమణమ్మ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: మండలంలోని అంట్లవార గ్రామంలో ఇటీవల వరి నూర్పిడి యంత్రం బోల్తాపడి ఇద్దరు మహిళా కూలీలు గంట రమణమ్మ, బి.శాంతి అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం పరామర్శించారు. మృతురాలు రమణమ్మకు వైఎస్సార్‌బీమా మంజూరు కావడంతో తక్షణ సాయంగా రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇదే ప్రమాదంలో గాయపడిన మరో మహిళ పరిస్థితిని వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, లింగాపురం సర్పంచ్ బూరాడ తవిటినాయుడు, బాడంగి జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మాటతప్పని నాయకుడు వైఎస్ జగన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అవ్వాతాతలతో పాటు వితంతువులకు అందజేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకను జనవరి నెల నుంచి రూ.3 వేలకు పెంచి ఇవ్వనున్నట్లు తెలిపారు. పింఛన్ల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేసినట్లు చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్ వెంటే ప్రజలంతా ఉన్నారని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, జేసీఎస్ కన్వీనర్ శ్రీరంగంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జడ్జి ఎం.బాబు

రాజాం సిటీ: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. స్థానిక కోర్టుల సముదాయం ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మన ఇల్లు, పనిచేసే ప్రదేశంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. బహిరంగ మలవిసర్జన, కలుషిత నీరు తాగడం, వివిధ రకాల వ్యర్థాలను నిర్మూలించకపోవడంతో అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. చెత్తను వీధికాలువలు, బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ


విద్యార్థికి దుస్తులు పంపిణీ చేస్తున్న త్రినాథరావు, సత్యనారాయణ

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామంలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన గార త్రినాథరావు, సత్యనారాయణలు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన సరస్వతీదేవి విగ్రహ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాలలోని 28 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నూకరాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ


రేగిడిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: కుష్టువ్యాధి నిర్మూలనపై రేగిడి పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించారు. వైద్యాధికారి జి.అసిరినాయుడు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు శనివారం ఉంగరాడ, గుళ్లపాడు, కేఎం వలస, తదితర గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. కుష్టువ్యాధి లక్షణాలు, చికిత్సా విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శలేని తెల్లని మచ్చలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే సులభంగా నివారించవచ్చన్నారు.

విద్యుత్ లైన్ల మరమ్మతులు

వంగర: మండలంలోని మద్దువలస, సంఘాం, జగన్నాథవలస, నీలాయవలస తదితర గ్రామాలలో వేలాడుతున్న విద్యుత్ వైర్లను శనివారం సరిచేశారు. వైర్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్‌శాఖ ఏఈ కె.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి

తెర్లాం: మండలంలోని విశ్రాంత ఉద్యోగులంతా వారి పెన్షన్లకు సంబంధించి లైఫ్ సర్టిఫికెట్లను తెర్లాంలోని సబ్ ట్రెజరీ కార్యాలయానికి అందజేయాలని విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివున్నాయుడు, మజ్జి రమణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2024 సంవత్సరానికి సంబంధించి పెన్షనర్లంతా జనవరి 1 నుంచి ఫిబ్రవరి నెలాఖరులోగా తమ లైఫ్ సర్టిఫికెట్లను ఉప ఖజానాధికారికి అందజేయాలని కోరారు.

సకాలంలో ధాన్యం డబ్బులు చెల్లింపు


ఆర్‌బీకేలో బయోమెట్రిక్ వేస్తున్న రైతులు

రేగిడి: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతులకు సకాలంలో నగదు చెల్లింపులు చేస్తున్నామని వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలో నాయిరాలవలస గ్రామంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతుల వివరాలు పరిశీలించారు. రైతులతో బయోమెట్రిక్ వేయించి, నగదుచెల్లింపులు జరిపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వానికి ధాన్యం విక్రయించిన రైతులు తమ పరిధిలో ఆర్‌బీకేల్లో బయోమెట్రిక్ వేయాలని సూచించారు. బయోమెట్రిక్ వేసిన రైతులకు మాత్రమే చెల్లింపులు జరుగుతాయని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో సంక్షేమ పథకాల పండగ

- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నాలుగున్నరేళ్లుగా సంక్షేమ పథకాల పండగ నడుస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కిలో శనివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి ఎమ్మెల్యే శంబంగి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని అన్నారు. గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎల్లోమీడియా, ప్రతిపక్షాలు కలిసి ఆడుతున్న దుష్ప్రచారాలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, సర్పంచ్ గంట పైడిరాజు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హమీద్, హౌసింగ్ ఏఈ అల్లు సూర్యనారాయణ, ఏఎస్సై జి.భాస్కరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ముగింపు సభ

నియోజకవర్గంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా పక్కిలో ముగింపు సభను ఆదివారం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ముగింపు సభలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, మీడియా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

సంక్షిప్తంగా..

ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి

రాజాం సిటీ: యువత, ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని టౌన్ సీఐ కె.రవికుమార్ సూచించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డిసెంబర్ 31 వేడుకల్లో పాల్గొనే యువత నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి రూ.10 వేలు జరిమానాతో పాటు ఆరు నెలల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని హితవుపలికారు. అసభ్యకరంగా ప్రవర్తించినా, సైలెన్సర్లు తీసి శబ్దకాలుష్యానికి పాల్పడినా, అర్ధరాత్రి 1 గంట దాటిన తరువాత వేడుకలు జరిపినా శిక్షార్హులని పేర్కొన్నారు.

పెరటి మొక్కల విక్రయం

రాజాం: స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద శనివారం మహిళా సంఘాల సభ్యులు మొక్కల విక్రయించారు. న్యూ ఇయర్ సందర్భంగా ఇంట్లో, పెరటిలో పెంచుకునే బంతి, చామంతి, బేంబూ, గులాబీ, అంథూరీయం, అగ్లోనెమా వంటి ఇండోర్, అవుట్ డోర్ మొక్కలను విక్రయించారు. ఏసీ ఎ.చిరంజీవి, ఏపీఎం అప్పలనాయుడు తదితరులు స్టాల్స్‌ను ప్రారంభించారు.

శ్రీరాముని అక్షింతల పంపిణీ

రాజాం: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని పవిత్ర అక్షితలతో పాటు శ్రీరామ మందిర చిత్రపటాన్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వితరణగా అందించారు. శనివారం అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను మండలంలోని 20 పంచాయతీలకు చేరవేయనున్నామని ఆ సంఘ సేవా ప్రముఖ్ శెట్టి శ్రీనివాసరావు తెలిపారు. వీటిని జనవరి 1 నుంచి ప్రతీ గడపకు అందించనున్నామని వెల్లడించారు. మామిడి రాధాకృష్ణ, వాకచర్ల మన్మథరావు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరానికి స్వాగతం


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బొబ్బిలి: మండలంలోని ఎం.పణుకువలస పాఠశాలలో శనివారం నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందురోజే కేక్ కట్ చేసి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పాఠశాల ఆవరణమంతా రంగవల్లులతో అలంకరించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

రామభద్రపురం: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని పోలింగ్ కేంద్రాల సెక్టార్ అధికారి వి.వెంకటయ్య అన్నారు. మండలంలోని దుప్పలపూడి, నరసాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల వద్ద తాగునీరు, ర్యాంపులు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించారు. 2024 ఏడాదిలో సాధారణ ఎన్నికలు జరగనున్నందున పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమై మౌలిక వసతులు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆయన వెంట వీఏఏ కొండలరావు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు

తెర్లాం: మండలంలోని చీకటిపేట పంచాయతీ పరిధిలోని మోదుగువలస శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ మూడడ్ల పార్వతి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడికలను వేతనదారులతో తొలగించారు.

• రాజాం: మండలంలో గారాజుచీపురుపల్లి గ్రామంలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి ఎం.సురేష్ తెలిపారు. ఈఓపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు పనులను పర్యవేక్షించారు.